# సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా ఓవరాల్ ఛాంపియన్



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన రెండో ఎడిషన్ సీఎం కప్ క్రీడా పోటీల్లో ఆదిలాబాద్ జిల్లా అద్భుత ప్రతిభ కనబర్చి ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా జిల్లా క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ ప్రమాణాల ఆధారంగా నిర్వహించిన ఈ పోటీల్లో ఆదిలాబాద్ జిల్లా అత్యధికంగా 82 పాయింట్లు సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుందని తెలిపారు. జిల్లాకు ఈ విజయం గర్వకారణమని, క్రీడాకారుల కృషి, పట్టుదలతోనే ఈ ఘనత సాధ్యమైందని అన్నారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని సాధించిన ఆదిలాబాద్ జిల్లాకు చెందిన 50 మంది క్రీడాకారులు హైదరాబాద్‌లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొననున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీవైఎస్ఓ శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# కోర్టుకు హాజరుకాని వ్యక్తి అరెస్ట్




**ఉద్యమ కెరటం, తాండూర్:** మంచిర్యాల జిల్లా కోర్టులో నమోదైన ట్రాన్స్ఫార్మర్ దొంగతనం కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకొని తిరుగుతుండగా సోమవారం అరెస్ట్ చేసినట్లు తాండూర్ ఎస్సై కె.ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. తాండూర్ మండలం తంగెళ్ళపల్లి గ్రామానికి చెందిన గోగు బాలకృష్ణ ట్రాన్స్ఫార్మర్ దొంగతనం కేసులో నిందితుడిగా ఉన్నాడు. కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో జిల్లా జడ్జి జారీ చేసిన నాన్ బెయిలబుల్ వారెంట్ మేరకు అతడిని అరెస్ట్ చేసి మంచిర్యాల జిల్లా జడ్జి ముందు హాజరుపర్చినట్లు తెలిపారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని లక్షెట్టిపేట్ జిల్లా జైలుకు తరలించినట్లు వివరించారు.

# హనుమాన్ ఆలయ కమిటీ ఎన్నిక



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని బోయపల్లి హనుమాన్ ఆలయ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ అధ్యక్షులుగా మసాడి విజయ్, కమిటీ సభ్యులుగా చదువుల సురేష్, మసాడి నాగరాజు, పాలగాని వెంకటేష్, గాజె రాజేశం, పిడుగు సత్యనారాయణ, ఇప్పరాజం, చొక్కాల నాగభూషణంలను ఎన్నుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రేపు వారాంతపు సంత వేలం

**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఐబీ రైల్వే గేట్ వద్ద నిర్వహించే శనివారం వారాంతపు సంత వేలం పాట ఈనెల 25న శనివారం వారాంతపు సంత ఆవరణలో జరుగనున్నట్లు కొత్తపల్లి సర్పంచ్ ఆకుల వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి మెరుగు లక్ష్మణ్ లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు మేకల మార్కెట్ వేలం డిపాజిట్ రూ.50వేలు, కూరగాయల మార్కెట్ వేలం డిపాజిట్ రూ.25 వేలు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

# ప్రజావాణి ఫిర్యాదులను నెల రోజుల్లో పరిష్కరించాలి

**• కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రజావాణి పోర్టల్‌లో నమోదయ్యే ఫిర్యాదులను నెల రోజుల్లోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వయంగా స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సామాజిక భద్రతా పెన్షన్లు, ఉపాధిహామీ పనులు, భూ భారతి సమస్యలు తదితర అంశాలకు సంబంధించి మొత్తం 93 అర్జీలు అందినట్లు తెలిపారు. వీటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చే ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని, మండల స్థాయిలో ఎంపీడీఓలు, ఇతర అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి యాక్షన్ టేకెన్ రిపోర్ట్‌లను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఒకే సమస్యపై పదేపదే ఫిర్యాదులు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని, అప్పీల్ కేసులను రెండు మూడు రోజుల్లోనే పరిష్కరించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు అందించే భోజన నాణ్యత విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. కొత్త మెనూ ప్రకారం బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ సమయానికి అందించాలని, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. బియ్యంలో పురుగులు కనిపిస్తే సరఫరాదారుల నుంచి సరుకులను తిరిగి పంపించి నాణ్యమైనవి తెప్పించాలన్నారు. ప్రత్యేక అధికారులు వారానికి కనీసం రెండుసార్లు హాస్టళ్లను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని సూచించారు. అదేవిధంగా వివిధ ప్రభుత్వ శాఖల పేరుతో ఉన్న మున్సిపల్ ఆస్తి పన్ను బకాయిలను వెంటనే చెల్లించాలని సంబంధిత హెచ్ఓడీలకు సూచించారు. ఏప్రిల్ 1 నుంచి 7 వరకు నిర్వహించే ఆరోగ్య వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా ఫుడ్ సేఫ్టీ మేళాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో సేవలందించినందుకు గాను జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా అధికారులను అమన్ ఫౌండేషన్ స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ స్రవంతి, డీఆర్డీఓ రవీందర్, డీవైఎస్ఓ శ్రీనివాస్, డీఎండబ్ల్యూఓ కలీం, డీపీఓ రమేష్, తహశీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రాజు, అమన్ ఫౌండేషన్ అధ్యక్షుడు అర్షాత్ ఖాన్, ఫౌండేషన్ ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొంగ సత్య నారాయణ విమర్శించారు. కాగజ్‌నగర్ మండలం కోస్ని గ్రామంలోని ప్రాణహిత భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. కేవలం మూడు సంవత్సరాల్లోనే రూ.3లక్షల 75వేల కోట్ల అప్పులు చేసి, ఆ డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. 3లక్షల ఆసరా పింఛన్లను ఒకేసారి తగ్గించి పేదలపై భారాన్ని మోపిందన్నారు. "యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ" పేరిట చేపట్టిన నిర్మాణాల్లో భారీ అవినీతి చోటుచేసుకుందని ఆరోపించారు. రైతుబంధు సాయం మూడుసార్లు నిలిపివేసి, బడ్జెట్‌లో కూడా రైతులను మోసం చేసిందని పేర్కొన్నారు. జాబ్ క్యాలెండర్ పేరిట తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి మూడు సంవత్సరాలు గడిచినా అమలు చేయలేదని పేర్కొన్నారు. గురుకుల విద్యా వ్యవస్థను దెబ్బతీసి సుమారు 170 మంది విద్యార్థుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పనులను తొలగించే ప్రయత్నం జరుగు తోందన్నారు. ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రజల తరఫున తీవ్ర ఆందోళనలు చేపడతామని హెచ్చ రించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ యూత్ కన్వీనర్ కాశిపాక రాజు, కాగజ్‌నగర్ పట్టణ అధ్యక్షుడు పార్వతి అంజన్న, కాగజ్‌నగర్ మండల మాలి సంఘం ప్రధాన కార్యదర్శి వసాకే హనుమంతు, వంజిరి సర్పంచ్ గోపాల్, మాజీ కౌన్సిలర్ నక్క మనోహర్, బండి వాసు, రావుజి, శెట్టి వెంకటేష్, తుకారాం, బాబాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జన భవిత చారిటబుల్ ట్రస్ట్ తొలి వార్షికోత్సవం




**ఉద్యమ కెరటం, కౌటల:** మండల కేంద్రంలో ఆదివారం జన భవిత చారిటబుల్ ట్రస్ట్ (జేబీసీటీ) తొలి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రస్ట్ వ్యవస్థాపకులు అమెరికాలో నివసిస్తున్న ఎన్ఆర్ఐ చంద్రశేఖర్ జాడే, ట్రస్ట్ చైర్మన్ వరలక్ష్మి జాడే, ట్రస్ట్ అధ్యక్షుడు సురేష్ డోంగ్రే హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, కౌటల సర్పంచ్ నక్క శంకర్, సీనియర్ నాయకులు కొంగ సత్యనారాయణ, మాజీ జెడ్పీ చైర్మన్ గణపతి, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రమేష్ కుమార్ పాల్గొని ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ఈ సందర్భంగా అమెరికాకు చెందిన మాట ఆర్గనైజేషన్తో కలిసి సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ట్రస్ట్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేత హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులు నృత్యాలు, యోగ పిరమిడ్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటికే స్పోకెన్ ఇంగ్లీష్, కాంపిటీటివ్ పరీక్షల శిక్షణ, మోటివేషనల్ క్లాసులు నిర్వహిస్తున్నామని, త్వరలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) క్లాసులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌటల మాజీ సర్పంచ్ రాజేందర్ గౌడ్, ఉప సర్పంచ్ డబ్బా గోపాల్, యోగ గురువులు దాసరి వినోద్, దౌలత్, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి జంగంపల్లి మహేందర్ సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలి




**ఉద్యమ కెరటం, తాండూర్:** మనుషుల మధ్య వివక్షలేని, శ్రమ దోపిడి లేని సమాజం నిర్మించాలన్నదే భగత్ సింగ్ స్వప్నమని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరు కృషి చేయాలని సీపీఎం మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యుడు డి.రాజారాం అన్నారు. తాండూర్‌లో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ 95వ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1931 మార్చి 23న బ్రిటీష్ ప్రభుత్వం భగత్ సింగ్‌ను ఉరిశిక్ష విధించిందని, అప్పటికి ఆయన వయసు కేవలం 23 సంవత్సరాలే అని గుర్తుచేశారు. దాదాపు వందేళ్లు గడిచినా ఆ మహావీరుల త్యాగాలు ఇప్పటికీ ప్రజలను ఉత్తేజపరుస్తూనే ఉన్నాయని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన మహా విప్లవకారుడు భగత్ సింగ్ అని కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధులు కలలుగన్న సమ సమాజం నిర్మాణానికి, సమస్త మానవాళికి మంచి రోజులు తీసుకురావడానికి నేటి పోరాటాలకు భగత్ సింగ్ జీవితం, ఆయన ఆలోచనలు తరగని స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వేల్పుల శంకర్, రామకృష్ణ, లక్ష్మణ్, దుర్గయ్య, రాజేశం, సంపత్, పోశం, అశోక్, చిలుకయ్య, భీమయ్య, మల్లేష్, స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

**• జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షల నిమిత్తం జిల్లాలో 48 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, మూత్రశాలలు, అవసరమైన మందులు, వైద్య సిబ్బంది నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఐటీడీఏలో 'డిజిటల్' విప్లవం

- ఫిర్యాదుల పరిష్కారానికి 'ఐటీడీఏ పల్స్'



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** గిరిజన ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచే లక్ష్యంతో ఉట్నూర్ ఐటీడీఏ మరో కీలక మైలురాయిని అధిగమించింది. ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు, వేగంగా పరిష్కరించేందుకు వీలుగా ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థను పూర్తిగా డిజిటలైజ్ చేశారు. 'ఐటీడీఏ పల్స్' పేరుతో రూపొందించిన ఈ నూతన ప్లాట్‌ఫామ్‌ను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మట్ సోమవారం ప్రారంభించారు. ఇకపై ఐటీడీఏకు వచ్చే ప్రతి ఫిర్యాదు ఈ నూతన వ్యవస్థలోనే నమోదవుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఫిర్యాదుల పరిష్కారానికి నిరంతర పర్యవేక్షణ అత్యంత కీలకమని అన్నారు. ఈ డిజిటల్ వ్యవస్థ ద్వారా ప్రతి అధికారిని జవాబుదారీగా ఉంచే అవకాశం కలుగుతుందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్థితిగతులను ఉన్నతాధికారులు నేరుగా పర్యవేక్షించవచ్చని, దీంతో విధి నిర్వహణలో నిర్లక్ష్యానికి తావుండదని పేర్కొన్నారు.క్యూఆర్ కోడ్‌తో ఫిర్యాదు స్థితిగతుల పరిశీలన..ఈ వ్యవస్థలో భాగంగా ప్రతి ఫిర్యాదుదారునికి ఒక ఎలక్ట్రానిక్ ఫిర్యాదు కార్డును జారీ చేస్తారు. ఈ కార్డుపై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా బాధితులు తమ ఫిర్యాదు ఏ దశలో ఉంది.? ఏ అధికారి వద్ద పెండింగ్‌లో ఉంది.? వంటి వివరాలను నేరుగా తమ మొబైల్ ఫోన్లలోనే తెలుసుకోవచ్చు. దీని ద్వారా ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని పీఓ వివరించారు.త్వరలో వాట్సాప్, ఆన్‌లైన్ పోర్టల్ సేవలు..సాంకేతికతను సామాన్యులకు మరింత చేరువ చేస్తూ, త్వరలోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో వాట్సాప్ ద్వారా కూడా ఫిర్యాదులు చేసే వెసులుబాటు కల్పిస్తామని యువరాజ్ మర్మట్ వెల్లడించారు. అలాగే ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను కూడా త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని, తద్వారా ప్రజలు ఎక్కడినుంచైనా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని వివరించారు.

# ఒలింపియాడ్‌లో టాలెంట్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** లిటిల్ ఛాంప్స్ ఎడ్యుకేషన్ అకాడమీ నిర్వహించిన ఇంగ్లీష్, సైన్స్, మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షల్లో సత్తుపల్లి పట్టణంలోని టాలెంట్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించి ప్రతిభ చాటారు. ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో 6వ తరగతి విద్యార్థి షేక్ హనీఫ్, 7వ తరగతి విద్యార్థి నక్క జోష్ విత్ చరణ్, 8వ తరగతి విద్యార్థి షేక్ ఆస్పియా రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించి గోల్డ్ మెడల్స్ తో పాటు ప్రశంస పత్రాలు అందుకున్నారు. సైన్స్ ఒలింపియాడ్‌లో సావర్కర్, హాసిని, ఆస్పియా రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించి గోల్డ్ మెడల్స్, ప్రశంస పత్రాలు అందుకున్నారు. అలాగే మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో 6వ తరగతి విద్యార్థులు షీమా, సావర్కర్, 7వ తరగతి విద్యార్థి జోషిత ఉమాశ్రీ, 8వ తరగతి విద్యార్థి షేక్ ఆసిఫియా రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించి గోల్డ్ మెడల్స్, ప్రశంస పత్రాలు అందుకున్నారు. అదేవిధంగా ఒలంపియాడ్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వందమంది విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. విజయం సాధించిన విద్యార్థులను టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పులి అరుణ, స్కూల్ ఇంచార్జ్ శంకర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో టాలెంట్ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ సీఐపై చర్యలు తీసుకోవాలి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఇచ్చోడ ఎక్సైజ్ సీఐపై తగిన చర్యలు తీసుకోవాలని నేరడిగొండ మండల కేంద్రానికి చెందిన కిరాణా వ్యాపారి ముక్క శ్రీనివాస్ కోరారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. తాను గత 45 సంవత్సరాలుగా కిరాణా దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నానని తెలిపారు. గత సంవత్సరం డిసెంబర్ 15న ఎక్సైజ్ శాఖ సీఐ తన సిబ్బందితో కలిసి దుకాణానికి వచ్చి, దుకాణంలో ఉన్న ఒక వినియోగదారుపై చేయి చేసుకున్నారని అన్నారు. అలాగే బెల్లం, గంజాయి అమ్ముతున్నావని తప్పుడు ఆరోపణలు చేసి కేసు పెట్టి జైలుకు పంపిస్తానని బెదిరించారని పేర్కొన్నారు. ఈ ఘటనతో ఆయనపై బోథ్ మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు నేరడిగొండ పోలీస్ స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు నేరడిగొండ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసి మూడు నెలలు పది రోజులు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఈ విషయాన్ని ఎస్పీకి వాట్సాప్, ఇమెయిల్ ద్వారా కూడా తెలియజేశానని చెప్పారు. ఈ అంశంపై వెంటనే విచారణ జరిపించి ఇచ్చోడ ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్‌తో పాటు ఇతర ముగ్గురిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఎస్పీని కోరారు.

# రైతు భరోసా నిధుల విడుదలపై హర్షం



- సీఎం రేవంత్‌కు పాలాభిషేకం

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు విడుదల కావడంతో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి తెలిపారు. సోమవారం ఆదిలాబాద్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్‌తో కలిసి సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేయడం రైతులకు పెద్ద ఊరట కలిగించిందన్నారు. రైతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ లో చేరిన సర్పంచులు

కండువాలుకప్పిస్వాగతించినకందిశ్రీ నివాస రెడ్డి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** గ్రామాల అభివృద్ధికి సర్పంచులు కృషి చేయాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సూచించారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ముగ్గురు సర్పంచులు ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బూర్నూర్, లోహార, లింగుగూడ గ్రామ పంచాయితీల సర్పంచులు ఆత్రం గంగారాం, వసంత్ రావు, మానిక్ రావులకు కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. గ్రామ పంచాయితీల ప్రగతి కోసం సర్పంచులు అధికార కాంగ్రెస్ లో చేరడం చాలా సంతోషకరమన్నారు. అంతా కలిసి పల్లెల ను అభివృద్ధి చేసుకుందామని పేర్కొన్నారు.

# భారీ వర్షాలతో నేలమట్టమైన పంటలు

కన్నీరు మున్నీరైన రైతన్నలు



**ఉద్యమ కెరటం, వేంసూరు:** వేంసూరు మండలంలోని రైతులకు ప్రకృతి తీవ్ర దెబ్బతీసింది. మండలంలోని గ్రామాల్లో సుమారు 1500 ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట భారీ వర్షం, ఈదురుగాలులకు పూర్తిగా నేలమట్టమైంది. మండలంలోని కందుకూరు గ్రామంలోని సుమారు 100 ఎకరాల్లో పంట నేలమట్టమయింది. కోతకు మరో పది రోజులు మాత్రమే మిగిలి ఉన్న సమయంలో పంట నాశనం కావడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఎకరానికి సుమారు రూ.50వేల వరకు పెట్టుబడి పెట్టి పండించిన పంట ఒక్కసారిగా నాశనం కావడంతో రైతులు లక్షల్లో నష్టపోయారు. ఇప్పటికే గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ విపత్తు మరింత భారంగా మారింది. "ఆరు నెలల శ్రమ ఒక్కరాత్రిలో పోయింది" అంటూ రైతులు వాపోయారు. వ్యవసాయ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు మండలంలోని గ్రామాలను సందర్శించి పంట నష్టం అంచనా వేసి నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందించాలని కోరుతున్నారు. ప్రభుత్వం త్వరితగతిన స్పందించకపోతే రైతుల పరిస్థితి మరింత దారుణంగా మారే ప్రమాదం ఉందని వాపోయారు.

# తహశీల్దార్ ఇమ్రాన్ కు సన్మానం



**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** ఇచ్చోడ మండల నూతన తహశీల్దార్ ఇమ్రాన్ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కళ్ళెం నారాయణ రెడ్డి అధ్యక్షతన మండల, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. భూ సమస్యలు, రేషన్ కార్డులు, కళ్యాణలక్ష్మీ వంటి కీలక సమస్యలకు సత్వర పరిష్కారం దిశగా కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కుమారం కోటేశ్వర్, జిల్లా సర్పంచ్ ఫోరం అధ్యక్షులు బోరిగామ సర్పంచ్ ఆసిఫ్ ఖాన్, బోథ్ నియోజవర్గ మైనార్టీ చైర్మన్ ముస్తఫా, మాజీ ఎంపీటీసీ జాహేద్, ఇచ్చోడ మండల్ మైనార్టీ చైర్మన్ రషీద్, ఏఎంసీ డైరెక్టర్ దూదిరాం, షేక్ జహీర్, మాజీ సర్పంచ్ సీహెచ్ రామదాసు, మాజీ వార్డ్ మెంబర్ ల క్షి బుర్ర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఓటమికి కుంగి పోవద్దు

- కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజక వర్గ ఇంచార్జ్ కంది శ్రీనివాస్



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఓటమి రేపటి గెలుపుకు పునాది అని, ఓడిపోయిన వారు కుంగిపోవద్దని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఇటీవలి గ్రామ పంచాయితీల ఎన్నికల్లో ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థులతో సోమవారం తన క్యాంపు కార్యాలయం ప్రజాసేవాభ వన్ లో సమావేశం నిర్వహించారు. మున్ముందు మంచి భవిష్యత్తు ఉందని వారిలో ఉత్తేజాన్ని నింపారు. ఓటమి చెందినప్పటికీ నిరాశ చెందకుండా రేపటి భవిష్యత్తు కోసం నిత్యం ప్రజల్లో ఉండాలని సూచించారు.

